# ప్రజాస్వామ్యం పరిణతి చెందాలి




- ఒకరినొకరు చంపుకొనే సంస్కృతి మనది కాదు
- తొమ్మిదేండ్లకింద తెలంగాణ ఎట్లుండే.. ఇప్పుడెలా ఉంది
- ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి
- అలంపూర్ ప్రజాఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

అలంపూర్ ప్రజాఆశీర్వాదసభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు

గద్వాల, అలంపూర్ 19 : ప్రజాస్వామ్యం పరిణతి చెందాలే.. మనకు కావాల్సింది ఫ్యాక్షనిస్టులు, దాదాగిరి, గుండాగిరి కాదని, ఒకరినొకరు చంపుకునే సంస్కృతి మనది కాదని సీఎం కేసీఆర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అలంపూర్ నియోజకవర్గంలోని శాంతినగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు, ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అలంపూర్ ప్రాంతంలో అష్టదశ శక్తి పీఠాల్లో ఐదో శకి పీఠమైన జోగుళాంబ దేవీ వెలిసిన పవిత్ర స్థానం. అక్కడ నుంచే దండం పెట్టి గతంలో అలంపూర్ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయం మీద 2002లో అలంపూర్ నుంచి గద్వాల వరకు పాదయాత్ర చేశానన్నారు. ప్రజలకున్న ఆయుధం ఓటు కాబట్టి దాన్ని జాగ్రత్తగా వాడుకుంటే మంచి జరిగే అవకాశం ఉందన్నారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణలో జరిగిన అన్యాయం మీకు తెలుసన్నారు. రైతాంగం ఏ విధంగా నష్టపోయిందో, మహబూబ్‌నగర్ జిల్లా ఎటువంటి దురవస్థలకు గురైందో మీరందరూ చూశారు. ఉద్యమ సమయంలో నేను నడిగడ్డ ప్రాంతానికి వచ్చినా.. ఇక్కడ సభ పెట్టి ప్రజల దుస్థితి చూసినా.. నేను కూడా కండ్ల నుంచి నీళ్లు తీసినా.. ఇంత అన్యాయం ఎవరి మీద జరిగినా ఊరుకోరు అని చాలా బాధపడ్డం. ఇక్కడి బాధలు వర్ణనాతీతం, ముంబైకి వలసలు యావత్ భారతదేశం ఎక్కడా చూసిన పాలమూరు బిడ్డలే. చాలా ఘోరమైన పరిస్థితులు మనం చూసినం అని సీఎం గుర్తు చేశారు. మీరందరినీ నేను కోరేది ఏందంటే, తొమ్మిదేండ్ల కిందట తెలంగాణ ఎట్లుండే, ఇప్పుడెంట్లుందో గమనించాలే. పరిస్థితులల్లా ఎంత మార్పు వచ్చిందో చూడాలే. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఈ ప్రాంతాన్ని ఆంధ్రాలో కలపడం వల్ల 58 ఏండ్లు గోస పడ్డాం. ఎవరూ మన బాధను తీర్చలే. ఇక్కడున్న కల్వకుర్తి నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులను పట్టించుకోకుండా పెండింగ్ ప్రాజెక్టులు అని పేరు పెట్టింద్రు. చేతులు ముడుచుకున్నరు గాని ఎవ్వడేం చేయలే అని సీఎం కేసీఆర్ విమర్శించారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల ద్వారా ఇప్పటికే 25, 30 వేల ఎకరాలకు సాగునీరు పారిచ్చుకుంటున్నం. మలిదశలో పనులన్నీ పూర్తి చేసుకొని చివరి ఆయకట్టు వరకు పారించుకుందాం. గతంలో బోయలను బీసీల్లో కలిపింది. గత పాలకులే కదా. ఈ సారి పోరాటం చేసి ఢిల్లీ మెడలు వంచైనా బోయలను ఎస్టీ జాబితా కలిపే బాధ్యత నాది. ఆర్డీఎస్ వద్ద బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి బాంబులు పెట్టి షట్టర్లు బద్ధలు కొడతామంటే, మేము కూడా సుంకేసుల వద్ద బాంబులు వేసి బారెజ్ బద్ధలు కొడతామన్నం. పాలమూరు జిల్లాలో బాంబులేసే మొగోడు ఇంతవరకు పుట్టలేదు. నీవు పుట్టావని పాలమూరు ప్రజలు సంతోష పడ్డారన్నారు. తూములు బద్ధలు కొట్టి ఆర్డీయస్ నీటిని పారించుకుపోతుంటే పట్టించుకునేనాథుడు లేరు. కాంగ్రెస్ నాయకులు చేతులు ముడుచుకొని చూస్తుండిపోయారు. 50 ఏండ్ల పాలనలో కాంగ్రెస్ నాయకులు ఏం చేశారో గుర్తుంచుకోవాలన్నారు. ఆనాడు చేసింది చాలదా ఈ నాడు మళ్లీ కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ రాజ్యం తెస్తామంటున్నారు. ఏం ఉండే ఇందిరమ్మ రాజ్యంలో అంతా ఆకలి బతుకులు, ఎవడు ఆదుకున్నోడే లేడు. పేదలను పట్టించుకున్నోడు లేడు, వారి ఆకలి కడుపులు నింపినోడు లేడు. రైతుల పొలాలకు నీరిచ్చినోళ్లు లేరు. తెలంగాణను ఆగం చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులే. అంతా ఎండిచచ్చినం. ఏది కూడా చేమయలే.. ఎన్టీ రామరావు వచ్చి రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చినా మనవి ఆకలి బతులే కదా. రైతు బంధు, రైతు బీమ వంటి సంక్షేమ పథకాలు ముందు ముందు రావాలంటే రాబోయో ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి విజయుడును గెలింపించాలి. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, విజయుడు నాయకత్వంలో అలంపూర్ ప్రాంతానికి ఏమేమి కావాలో అన్ని చేస్తా, ఎమ్మెల్సీ చల్లా ఎంత పట్టుదల ఉన్న వ్యక్తో మీకు తెలుసు, వారి కుటుంబం గతం నుంచి కూడా ప్రజలకు సేవ చేసింద్రు తప్పా, ప్రజలనుంచి ఏమి ఆశించునోళ్లు కాదు. మంచి కుటుంబం మచ్చలేని కుటుంబం. రాజకీయంతోనే పెనవేసుకున్న కుటుంబం. మొన్నటికి మొన్న వర్షాలు లేక పంటలు ఎండుతున్నయని పట్టుబడితే ఇరిగేషన్ అధికారులతో నేను మాట్లాడి నీరు వదిలించినా.. రాబోయే కాలంలో కరువులనేదే రాకుండా చేస్తాం అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, గట్టు తిమ్మప్ప, మున్సిపల్ చైర్‌పర్సర్ మనోరమావెంకటేశ్, కరుణాసూరి, దేవన్నతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కల్వకుర్తి ప్రజాఆశీర్వాదసభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

### పాలమూరు- రంగారెడ్డితో

# లక్షా యాభైవేల ఎకరాలకు సాగు

- కాంగ్రెస్‌కు గెలిపిస్తే.. కరెంట్ కాటగలుస్తది
- రైతు బంధుకు రాంరాం, దళిత బంధుకు జైభీం
- 50 ఏండ్ల హస్తం పాలనలో పుట్టెడు కష్టాలు అనుభవించినం
- వాళ్లొస్తే దళారుల రాజ్యం వస్తది
- కల్వకుర్తి ప్రజాఆశీర్వాదసభలో ముఖ్యమంత్రి కేసీఆర్


కల్వకుర్తి, నవంబర్ 19 : బీఆర్‌ఎస్‌కు ఓటేసి జైపాల్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే కల్వకుర్తి నియోజకవర్గానికి పాలమూరు- రంగారెడ్డి ఎతిక్తపోతల పథకం ద్వారా 1.50లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బాధ్యత తాను తీసుకుంటానని ముఖ్యమంత్రి కేసీఆర్ కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు భరోసా ఇచ్చారు. మహాత్మాగాంధీ, పాలమూరు ఎత్తిపోతల పథకం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గానికి దాదాపు 90 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా ఆదివారం సాయంత్రం కల్వకుర్తిలో నిర్వహించిన ప్రజాఆశీర్వాధ సభకు సీఎం కేసీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పరిపాలన కాలంలో కల్వకుర్తి నియోజకవర్గ బిడ్డలు పడ్డ కష్టాలను ముఖ్యమంత్రి మరోసారి గుర్తుకు తీసుకువచ్చారు. కరెంట్‌లేక, సాగునీరు లేక, వ్యవసాయాలు లేక, బతకనీకే సౌలతులు లేక వలసలు పాలయ్యారని, పట్టణాలకు తరలిపోయి లంబాడీ బిడ్డలు ఆటోలు తోటుకుంటూ పడ్డ కష్టాలు కన్నీళ్ళు తెప్పిస్తాయని.. ఆనాటి కష్టాలను గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంక రైతులు, పేదల సంక్షేమంతో పాటు పారిశ్రామిక విధానాలను తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి సాధిస్తున్నాం. ప్రజలు కడుతున్న పన్నులను తీసుకుపోయి కేసీఆర్ రైతులకు రైతుబంధు ఇస్తున్నారని కాంగ్రెస్ నాయకులు డైరెక్ట్‌గా మాట్లాడుతున్నారు. రైతుబంధు వేస్ట్ అని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. జైపాల్‌యాదవ్‌ను గెలిపిస్తే రైతు బంధును ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కరెంట్ 24గంటలు అవసరం లేదని పీసీసీ ప్రెసిడెంట్ అంటున్నారు.. మేము అధికారంలో వస్తే 3 గంటలు కరెంటు ఇస్తామని చెబుతున్నారు. కరెంట్ ఎట్ల సరిపోతదయా అంటే 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాని సెలవిస్తున్నాడు ఆ బుద్ధిమంతుడు. కరెంట్ 24 గంటలు ఉండాలంటే బీఆర్‌ఎస్ ఖచ్చితంగా గెలవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే చాలా కమిటేడ్‌గా పనిచేస్తున్నారు. ప్రభుత్వంపై, నాపై ఒత్తిడి తీసుకువచ్చి కల్వకుర్తి నియోజకవర్గానికి 90 వేల ఎకరాలకు సాగునీరు పారేలా చేసుకున్నాడు. 50 ఏండ్ల పరిపాలనలో కష్టాలకు గురిచేసిన కాంగ్రెస్ రూ.200 పింఛన్ మన మొఖాన కొట్టింది. ఉన్న తెలంగాణను ఆంధ్రలో కలిపింది, ఉద్యమం చేస్తే కాల్చి చంపింది. కల్వకుర్తి సమీపం నుంచి రింగ్ రోడ్ వస్తుంది, ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందుతుంది. బట్టి విక్రమార్క చెబుతున్నాడు. కాంగ్రెస్ వస్తే ధరణిని తీసేస్తారట. ధరణీ తీసేస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి. బ్రోకర్లు పెరుగుతారు. రైతు బంధు నిలిచిపోతుంది. ఇన్ని ఇబ్బందులకు గురిచేస్తామంటున్న కాంగ్రెస్ ఓటు వేస్తే బతుకులు ఆగమైపోతాయి, పైరవీకారులు పెరుగుతారు, ఆలోచించుకోండి. మీటింగ్ ముగిసిన తర్వాత ఊర్లకు పోయి చర్చ పెట్టుకొండి. జాగ్రతగా ఆలోచించుకుని ఓటు వేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను గెలిపిస్తే ఆయన అడిగిన కోరికలన్నీ నెరవేరుస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆమనగల్లులో రెవెన్యూ డివిజన్, ఏసీపీ, ఎంవీఐ, కల్వకుర్తిలో ఇంజినీరింగ్ కళాశాలతోపాటు కొత్త మండలాలు ఏర్పాటు చేస్తానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జైపాల్‌యాదవ్ బీసీ బిడ్డ.. సీట్లు ఇవ్వని చోట ఇవ్వకలేకపోయాం. ఇచ్చిన చోట బీసీ ఐక్యత ప్రదర్శించాలి. బీసీ బిడ్డ జైపాల్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ రాములు, బీఆర్‌ఎస్ నాయకులు బొంతు రామ్మోహన్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోళి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వెంకటేశ్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ ప్రజాఆశీర్వాద సభలో కళాకారుల పాటలకు నృత్యాలు చేస్తున్న మహిళలు



నాగర్‌కర్నూల్ సీఎం సభలో నృత్యం చేస్తున్న గిరిజన మహిళ



కొల్లాపూర్ ప్రజాఆశీర్వాద సభలో సీఎం ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న యువకులు



సీఎం సభలో సెల్ఫీలు తీసుకుంటున్న యువకులు



కల్వకుర్తి ప్రజాఆశీర్వాదసభలో పాటకు నాయకులతో కలిసి స్టెప్పులు వేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్